అందాల
అల్లికలల్లే
చేనేతగాళ్ల
వెతలు?

# లోన్లొస్తున్నాయ్

గాదిరాజు
మధుసూదనరాజు
కథ

వృత్తికళానైపుణ్యానికి నకళ్లు వాళ్లు!

ఎన్నెన్నో రంగుల్లో రకరకాల డిజైన్లలో — అతివలకు అందాలను చుట్ట చుట్టి కట్టబెట్టే పట్టుచీరలనేతగాళ్లు వాళ్లు!!

కళ్లూ, కాళ్లూ, చేతులూ ఒక్కటేమిటి ఒళ్లు ఒళ్లంతా యంత్రంలా రేయింబవళ్లూ కదిలితేగాని మగ్గంలోంచి ఒక్క చీర చేతిలోకి రాదు.

ఊపిరున్నంతకాలం సగం గుంతలో — ఊపిరాగిన్నాదు పూర్తి గుంతలో — బతుకంతా గుంతలో. బతికినంతకాలం విశ్రాంతికి నోచుకోని — ఈ నేతగాళ్ల సరదాలూ ఆశలూ కలలూ అన్నీ కుక్కి కొట్టాల్లో కూలి మగ్గాలకే బలైపోతుంటాయ్. కూలి మగ్గపోళ్ల ధ్యేయం, లక్ష్యం, ఆశ, కల — సొంతమగ్గం పెట్టుకోవడమే! వాళ్ల ఆరాటాలు, ఆలోచనలన్నీ సొంతమగ్గానికే పరిమితం!


○ ● ○

కొండంత పనిని నెత్తినేసుకుని, బోరపీచుకొట్టంలోంచి బయటికి అడుగుపెట్టింది లక్ష్మమ్మ.

"లక్ష్మమ్మను చూస్తూనే 'యాడికి' అంది షుబ్బమ్మ ఆత్రంగా.

"యాడికిపోతే నీకెందుకే! గౌవ్మెంటాఫీసోళ్లు మన మగ్గాలోల్లకి అవేంటివో లోన్లు ఇస్తన్నారంటూ అచ్చు అతికే అచ్చమ్మ చెబితేనూ ఇసయం తెలుసుకొద్దామని పెద్దాయనకాడికి పోతండ" అంటూ గిరుక్కున వెనుతిరిగి ప్రక్క గుడిసెలో కూలి మగ్గం వేస్తున్న కొడుకు దగ్గరకెళ్లింది లక్ష్మమ్మ.

"ఒరే మల్లిగా! అపసెకునం అయిందిరా ... నేను పోయినా ఇంగ పనికాదుగాని



మవ్వేళ్లు'' అంటున్న తల్లిమాటలు పూర్తికా కముందే...

''పర్లేయే! అంతా ఇన్నానుగానీ... మన వూరిపేరే 'యాడికి' మన యాడికిలో యాడికి అంటే దోసం లేదే మవ్వే పోయే'' అంటున్న కొడుకు గడ్డం పట్టుకుని ''వా వాయివే పోయిరారా'' అంటూ బతిమిలాడింది దీనంగా.

"పోతాన్లే... అయినా నేను పోతే మగ్గమెవడు నేస్తాడు. లేసివాంక మళ్లీ మగ్గంమీద కూర్చోమంటే వాతోకాదు. ఈ ఒక్కదోనె తిప్పి పోతాన్లే"

"వద్దులేరా! ఇట్టాంటి దోనెలు ఎనభై తిప్పితేగాని ఒక్క చీర పూర్తికాదు.అ దేదో లోను పదారువేలు ఇస్తారంట. అదొచ్చిందంటే సుబ్బరంగా సొంత మగ్గం పెట్టుకోమ్మ. పోయిరారా" అంటున్న తల్లి పోరు పడలేక మగ్గంమీంచి లేచి ఈదిలోకి వచ్చాడు మల్లిగాడు. వొళ్లంతా పట్టిన చెమటని తుండుగుడ్డతో తుడుచుకుని అంగీ తొడుక్కుంటూ.

"పెద్దాయన సింతలాయుడుగారు దొరకాలంటే మాటలా ఆయనకెన్ని పన్లో! గౌవ్మెంటాఫీసుల్లో జరగాల్సిన సన్నాసపకోళ్ల పనులన్నీ ఆయనే సూడాలాయె" అనుకుంటూ పెద్దాయనగారి ఇంటికాడికి చేరుకున్నాడు మల్లిగాడు.

○ ● ○

"ఏరా మల్లిగా! లోనుకోసరమేనా? పలకరించాడు సూరయ్య.

"ఔ"నన్నట్లు తలూపాడు మల్లిగాడు.

"మొగం కూడా కడుక్కోకుండా ముసిముసి సీకట్లోనే పెద్దాయనకోసరం నేనూ అదే పనిమీదనే వచ్చినాన్రా. అమ్మయ్యనడిగితే ఇయ్యాలకు వస్తాడనింది. రాలేదు"

"ఎక్కడికి పోయినాడంట సూరయ్య మామా"

"కొట్టాలపల్లికి పోయినాడంట. పోదామంటావా? ఆయనతో అక్కణ్ణే ఒకమాట సెపితే సరిపోతది. ఆయనొచ్చి అన్నీ సూసుకుంటాడు. ఎంతమందికని ఎగదోస్తాడు చెప్పు!" అంటున్న సూరయ్య మాటలు పూర్తిగాకముందే.

"నిజమే మామా పోదాం పా! ఛార్జీలు కర్సులు అయితే ఓ పదో ఇరవయ్యో అయితాయ్ అంతేగద" అంటూ డ్రాయర్ జేబులోంచి డబ్బులు తీస్తూ బదులిచ్చాడు మల్లిగాడు.

బస్సు దొరికి కొట్టాలపల్లెకి చేరేటప్పటికి టైం ఒంటిగంటయింది. అక్కడే తడికెల హోటల్లో ఉగ్గాని మిరకాయ బజ్జీలు తినేసి పెద్దాయనకోసం రెడ్డోళ్ల ఇంటికి నడిచారిద్దరూ.

ఏం లాభం రెడ్డోళ్ల జీతగాడు ఎదురొచ్చి "ఏదో పంచాయతీకోసం పెద్దాయన్ని సింతలాయపల్లోళ్లు పిలుచుకుని పోయినా"రంటూ చెప్పేసి బీడీ అడిగి ఇప్పించుకుని ముట్టించుకుని పొగ ఎగబీలుస్తూ ఎల్లిపోయినాడు.

"ఇంత దూరమే వచ్చినాం — సింతలాయపల్లెకు పోదాం పా" అన్న మల్లిగాని మాటతో వెతుకులాట తిరుగులాటగా మారింది. రాత్రులూ పగళ్లూ తిరిగి తిరిగి ఇద్దరికీ ఒళ్లు హూనమైపోయింది.

○ ● ○

నాలుగు రోజులుగా కొడుకు కనబడకపోయేసరికి మొగమెలిసిందో ఏమో కొడుకు అంత దూరంలో కనబడగానే కళ్లనీళ్లతో ఆత్రంగా ఎదురొచ్చింది మల్లిగాని తల్లి లక్ష్మమ్మ.

"పనిగాకుండా ఇంటికొస్తే నువ్వూరుకోవని పెద్దాయనకోసం ఊర్లన్నీ తిరిగానే. లెక్క అయిపోయింది. గుండయ్యకాడ రెండొందలు అప్పు కూడా చేసినాను" తల

గోక్కుంటూ అన్నాడు మల్లిగాడు ఆమె చూపుకి జవాబుగా.

"పర్లేగానీ... ఇంతకీ పని ఏమయింది? పెద్దాయన దొరికినాడా?"

"ఆ. ఆయనతో కలిసి ఆఫీసుక్కూడా పోయినాను"

"లోను ఇత్తామన్నారా" మరింత ఆత్రంగా అడిగింది.

"ఆ. అవేవో సట్టిఫికెట్లు కావాలంట. తెమ్మన్నారు. వారం రోజులు గడువిచ్చారు" నీరసంగా అన్నాడు.

"అవేంటివో ఇచ్చేసి రాకపోయావా" విష్టారంగా అంది.

"అవేంటివో ఏమో మళ్లీ చెప్పినా నాకు అర్దమయి సావలేదే"

"పెద్దాయన్నే అడక్కపోయావా?"

"ఆ అడిగావే. 'ఇట్టాంటి సిన్నసిన్నవన్నీ నేనెక్కడ సూసేదిరా. అప్పయ్య టీచరు ఇట్టాంటి బాగోతాలన్నీ సూత్తంటాడుగదా ఆయున్నడుగు పో' అన్నాడే" అన్నాడు మల్లిగాడు దీనంగా.

"అడగగూడదా నాయనా" అంది తల్లి మురిపెంగా.

"ఆ. నీకన్నీ తొందరే. ఆకులో పెడుదు నా బోకిలో పెడుదునా అని వుంటావ్" నాల్గురోజులాయే. ఈ అంగీసూడు. నా అడ్డపంచ సూడు ఎట్టా మాసిపోయి కంపు కొడుతున్నాయో. ఇంత బువ్వతిని బట్టలు మార్చుకుని పోతాన్లే" విసుగ్గా నీరసంగా అన్నాడు మల్లిగాడు.

"నా తొందర మండిపోనూ. రా నాయనా! ఏన్నీళ్లు కాగబెట్టిస్తా. స్నానంచేసి బువ్వతిని పోదువుగానీ..." అంటూ ఇంట్లోకి నడిచింది తల్లి.

"సల్లంగ పోయిరా! నాయనా! సేమంగ బోయి, లాబంగా రా... కొండమీది బైరవలింగమయ్యకు మొక్కో! అట్టనే సంతబజారు కాడి సీతమ్మక్కూడా మొక్కో పని జరగాలని" అంటూ అప్పుడే పదారువేలు చేతిలో పడిపోయినంత సంబరంగా సాగనంపింది ఆ


## స్కూటర్

"అల్లుడికి మీరే స్కూటర్ కూడా కొనివ్వాలండీ"

"అదేమిటీ మీ అబ్బాయికి స్కూటర్ నడపడం చేతకాదు కదండీ"

"మావాడికి రాకపోతేనేం. నేను భేషుగ్గా నడుపుతా"

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



పిచ్చితల్లి కొడుకుని.

ఎగాసగా పడి అప్పయ్య పంతులింటికి పరుగెత్తాడు మల్లిగాడు. అప్లికేషన్లని, పెట్టి నోళ్లని వెంటేసుకుని ఆయనప్పటికే ఆఫీసు కెళ్లిపోయాడు. మల్లిగాడు అట్నుంచి అటే ఆఫీసుకు చేరాడు పరుగెత్తుతూ.

○ ● ○

"బడికిపోవాల్సినోళ్లే సెలవుపెట్టి మీకోసం తంటాలుపడతండాను. ఇంతవరకు గంగ నోట్లో పోస్కోలా! టిఫినేమైనా పెట్టిస్తావా" మల్లిగాని వాలకం చూసి నవ్వుకుంటూ అడిగాడు అప్పయ్యపంతులు.

"రండయ్యా! అంతకన్నానా" ఆప్యాయంగా పిలిచాడు మల్లిగాడు. అంతే...

"టిఫిన్ చేద్దాం రండి" అంటూ అప్పయ్యగారు ఆఫీసులోనివాళ్లందర్నీ పేరు పేరునా పిలిచాడు అదేదో ఆయనగారి మనవరాలి బారసాలకు పిలుస్తున్నట్టుగా.

అంతే బిలబిలమంటూ అంతా వచ్చేశారు.

"అంతా మన ఆఫీసర్లేరా. ఆర్డర్ చెప్పు" అంటూ మల్లిగాని వీపు నిమిరాడు ఆప్యాయంగా పంతులు మాట కాదనలేకపోయాడు. అంతే... వాడి జేబులోని ఏభై నోటు వాళ్ల నోటికి బలైపోయింది. పంతులు ఆఫీసులోకి వెళుతూ వస్తూ వున్నాడు. కూల్ డ్రింక్‌లు, సిగరెట్ పాకెట్లు కిళ్లీలు వగైరాలు ఆఫీసులోకి వెళ్తానే వున్నాయ్. నోటి మాట మాత్రం పంతులు ఇచ్చి... తే, నోటు మాట మాత్రం మల్లిగాడు — వానిలాంటి మరికొందరే చూసుకోవలసి వచ్చింది.

○ ● ○

అలా పంతులు చేతినుండి దరఖాస్తు కాగితం మల్లిగాని చేతికి రావడానికి మరో మూడురోజులు పడితే — పూర్తిచేయించేటప్పటికి మరో వారం పట్టింది.

దరఖాస్తు స్వీకరించేందుకే ఆఫీసువాళ్లు ఆరొందలు అడిగారు. పదహారువేలు వస్తాయన్న ఆశతో అప్పుచేసి వాళ్ల చేతులో పోశారు.

○ ● ○

"అబ్బ! నీ అప్లికేషనుని పై ఆఫీసుకి పంపా(రా! ఇక నీ అదృష్టం" అంటువున్న పంతుల్ని చూసి "అదేంటయ్యా అదృష్టమంటారు. గ్యారంటీగా రాదా? లంచం ఇచ్చాముగదయ్యా" అన్నాడు మల్లి ఏడ్పు గొంతుతో అమాయకంగా.

"నీలాగ లంచాలు ఇచ్చినోళ్లుకూడా వెయ్యిమంది వున్నారు. లోన్లు శాంక్షనైంది రెండొందలమందికే, అయినా నీకు వచ్చేట్టు చూస్తాగానీ... ఓ రెండు వందలు ఇవ్వు. పదారువేలంటే ఊర్కే వస్తాయ్యా(టూ" అంటున్న పంతులు వాగ్దాటికి లొంగిపోయి రెండొందలు ఇచ్చేశాడు మల్లిగాడు. "ఇంతే అయ్యిందంట" అనుకుంటూ.

○ ● ○

రేగిన జుట్టుతో మాడిన మొహంతో ఇంట్లోకి అడుగుపెట్టిన కొడుకుని చూస్తానే సంబరంగా ఎదురొచ్చి "ఏనయ్యిందారా" అంది తల్లి లక్ష్మమ్మ.

"శానాదాంక అయిపోయినట్టేనే ఇంక ...ము" అంటూ నిట్టూర్పు వదిలాడు మల్లి.

"అసలే మనం కూలీ మగ్గపోల్లం. నెలరోజులాయె మగ్గంమీద కూర్చోలేదు.

అప్పులోళ్లు తిరుగుతండారు. దిక్కు తెలీడం లేదురా. రెండువేల అప్పు! ఎట్టా తీరుతుందో ఏమో. ఇంతకూ లోను నాలుగు రోజులకన్నా వస్తాదంటావా?" గొణిగింది తల్లి.

"వస్తాదిలేయే. పదారేలు వచ్చేటప్పుడు ఈ రెండువేల రూపాయలు ఒక లెక్కా ఇచ్చేద్దాం" అంటూ చొక్కా ఇప్పేసి దండానికి తగిలించి, నులకమంచంమీద అడ్డం పడుకున్నాడు మల్లిగాడు అలసటగా.

"అందరూ లోను వచ్చినాయని ఆఫీసు దగ్గరికి పోతుంటే నీ కొడుకు ఇంట్లోనే పండుకున్నాడేందే లచ్చమ్మా" అంటూ కొట్టంలోకి అడుగు పెడుతూనే ముక్కుమీద వేలేసుకుని అడిగింది అమ్మ అలికే అచ్చమ్మ.

మల్లిగానికి గుండెల్లో రాయిపడ్డట్టయింది పంతులు దగ్గరకు పరుగుతీశాడు.

ఆత్రం పట్టలేక తామూ కొడుకువెంట బయల్దేరింది లచ్చమ్మ.

"నీకు అదృష్టం లేదురా. లోను రాలేదు వచ్చే ఏడాది చూద్దాంలే" అంటున్న పంతులుకి దండంపెట్టి "ఎందుకు రాలేదయ్యా" అన్నాడు మల్లిగాడు ఏడుస్తున్నట్లుగా ముఖం పెట్టి.

"ఎందుకేంటి? సొంత మిద్దె వుంటేనే ఈ సంవత్సరం లోన్లు ఇస్తారంట. బోదపేను కొట్టాలు, తాటాకు గుడిసెలున్నోళ్లకు ఇవ్వరట! నీకు లేదుగా" అన్నాడు పంతులు.


"మోసం! ఇదంతా ముందే చెప్పొచ్చుగా నేను పోయి పెద్దాయనతో చెబుతా" అంటూ గుడ్లురిమి చూసి నుదులు తిరుగుతున్న తడిని కంట్లోనే అదింపెట్టి విసవిసా నడిచాడు మల్లి.

○ ● ○

మల్లిగాడు పెద్దాయనతో మాట్లాడుతుంటే వాడి తల్లి లక్ష్మమ్మ గుమ్మం చాటునుంచి వింటూ బయటనే నిలబడింది.

"రెండువేలు కర్చుపెట్టావయ్యా" ఇప్పుడు పంతులు లోను రాలేదన్నాడు. ఆ

## దౌర్జన్యం



ఈ మధ్య బీహార్‌లోని హజారీబాగ్ కలెక్టరేట్ ఉద్యోగులు 300మంది మూకుమ్మడిగా సమ్మెచేశారట! దానికి కారణం జీతం పెంచమనికాదు — పన్నెండుమంది గుమాస్తాల్ని ఆ జిల్లా కలెక్టర్‌గారి భార్య తన మాట వినలేదని కొట్టడమేనట! ఉద్యోగులంతా కలెక్టర్‌గారి భార్య క్షమాపణ చెప్పమన్నా... ఆవిడ చెప్పనందట! చివరకు లాలూప్రసాద్‌యాదవ్‌గారు. విషయం తెలుసుకుని కలెక్టర్‌గారికి వార్నింగ్ ఇవ్వడంతో — ఆయనే తన భార్య తరపున క్షమాపణ చెప్పేసి... కథకు సుఖాంతం చేశాడట!

— జూపిటర్

పంతులు నా కడుపు కొట్టినాడు సూడ య్యా'' భోరున ఏడ్చాడు మల్లిగాడు.

''ఆఫీసు యవారాలంటే అంతే. పని అయ్యేదీ — కానిదీ చివ్వరిదాకా ఎవ్వరికీ తెలీదు. అయినా అంత డబ్బులెందుకు ఎగజల్లినావు. దళారీ గాళ్లను ఎందుకు నమ్మినావు. అంతకంటే ఆఫీసర్నే అడగాల్సి ంది సీవ్ పోయి. అయితే అయ్యేది. లేదంటే నీ కూలి మగ్గం నీకు వుండనే వుంది. దళారిగాళ్లకు డబ్బులిచ్చి నా దగ్గరకు వచ్చి అంగలార్తే నేనేమి చేసేది'' ఇంకా పెద్దాయ న మల్లిగాన్ని ఏదో మందలిస్తూనే వున్నాడు. గిరుక్కున వెనుదిరిగింది లక్ష్మమ్మ.

○ ● ○

''మీకు లోను వస్తుందో రాదో మాకు తెల్దు. పదో తారీక్కల్లా మా బాకీ రెండువే లు తీర్చకపోతే నీ బోదకొట్టంలోంచి బోకులు బోతెలు వీధిన పడతాయ్ జాగర్త'' బండా గుండయ్య రంకెలు ఒకవైపు.

''పదారేలప్పుడే వచ్చేస్తాయని, తానూ సొంత మగ్గంపెట్టి సావుకార్నయ్ పోదామని మిడిసిపడిందిరా. కొడుకుని మగ్గంమీదికి రానీయులా.

ఆశకుపోతే గోశిలా రాయిపడింది. హి... హి...'' తన తోటి కూలిమగ్గపోళ్లతో సావుకా రు ఎకసెక్కంగా అంటున్న మాటలు ఒకవైపు.

''ఈ తిప్పలు మనం పడలేమే. మన కట్టం మనం పడదాం. వెలకి ఒక వార్పు అయితే పద్దెదొందలు వస్తుంది అదిసాలే. ఈ లోన్లువద్దే అంటే ఇన్నావా'' అని కొడుకు అంటాడేమోనన్న బెరుకు గుబులు మరొక వైపు.

''ఇంట్లో పొయ్యిమీదికి నూకల్లేవు. అడీ పంలో అ(దూపాయ డబ్బులూ లేవు'' అన్న దిగులు మరొకవైపు వున్నా —

పడిన కష్టాలకి, వొచ్చిన నష్టాలకంటే పరాయోల్ల నోళ్లలో పడతండామే అనే గుబులే ఎక్కువగా వుంది లక్ష్మమ్మకి.

ఏడ్పును బిగబట్టుకున్నందుకేమో! ఆరె కెన్నం ముద్ద గొంతులో ఇరుక్కున్నట్లుగా వుంది ఆమెకి.

నూలు మగ్గాలోల్లు — రంగుల్లో కలిపేం దుకు ఉపయోగించే బూర! కడుపులోకి పోతే పశువులనైనా చంపగలిగే విషం — బూర!! ఎదురుగా కనిపించిందామెకి.

○ ● ○

''డబ్బు వట్టమయ్యిందిగాక — లోను రాకపొయ్యిందిగాక — పెద్దాయనతో అరుపు లు తప్పలేదు — జనంలో అవులయ్యపాలుగా కా తప్పలేదు'' తనలో తానే గొణుక్కుం టూ వచ్చిన మల్లిగానికి, తన కొట్టంముందు గుమిగూడిన జనాన్ని చూసి గుండె గుభేల్మని ంది. జనాన్ని చీల్చుకుంటూ కొట్టంలోకి అడుగుపెట్టాడు. నేలమీద పడి పొర్లుతున్న తల్లినిచూసి గగ్గొంతుతో—

''ఏమైందే నీకేమైందే'' అన్నాడు మోకా ళ్లమీద కూర్చుంటూ.

''ఏమైందేమిరా? మన బతుకుల్లో కొత్తే ముంది? మగ్గం బాగా సాగి డబ్బు గులగులా మంటే వారం వారం యాటకూర. బతుక ష్టం తిరిగి లబలబలాడితే గుండె బరువెక్కితే ఏకంగా ఇసంబూర — ఇంతేకదరా మన బతుకులు'' ఏడ్పు గొంతుతో గాల్లోకి చూస్తూ బాధగా అన్నాడు కులపెద్ద కేశన్న.

"ఎంత పనిచేసినావె? ఇసం తాగినావా? సచ్చి ఏం సాదిద్దామనుకున్నావే" అంటూ తల్లిని భుజం మీద వేసుకుని —


"నువ్వా రా మామా ఆస్పత్రికి తీస్కపోదాం" అన్నాడు గాబరాగా దీనంగా.

"ఒరేయ్ — ఎండమావుల్లాంటి ఈ లోన్లని — ఈ గవర్నమెంట్ సాయాల్ని నమ్ముకోకురా! పని పాడుచేసుకోకురా! అన్నాను. అంటే వింటేనా... అయినా వీడి అమాయకం గాకపోతే ఆ దళారీగాళ్ల చేతుల్లో డబ్బెందుకు పోయాల?

ఇప్పుడు సూడు! అటు లోనూ రాకపోయ — ఇటు అప్పులూ పెరిగిపోయ. అటు తిరిగి ఇటుతిరిగి పాణాలమీదకి తెచ్చుకుంది. ఎంగిలి పోగులతుక్కనే మనకి — ఈ గుల్ల కైకలు మింగుడుపడవురా అంటే ఇన్నాడా. అర్తంపర్తంలేని ఆశలు పెట్టుకుని ఇట్టా అయ్ పోయినాడు. పెద్దాయన మల్లిగాన్ని మందలించడంలో తప్పేముంది" మల్లిగాని వెంట నడుస్తూ గొణుక్కుంటున్నాడు కేశన్న.

నేతగాళ్లకు నేతగా కష్టసుఖాల్లో జతగా వుండడమేగాని, ఇలాంటి గొవ్మెంటు యవారాల్లో చేయూతనివ్వడం కేశన్నకు చేతగాదు. ఎందుకంటే ఆయన సాటిలేని నేతగాడే. కానీ కనీసం తెలుగులోనైనా రాతగాడు కాదు. నేతగాళ్లకు — నేత ఒక్కటే వుంటే సరిపోదురా. రాతకూడా వుండాలని నేతగాళ్లనేతగా ఆయన లక్షసార్లు చెప్పినా... ఎవ్వరూ పట్టించుకోరు మరి. ఈ నేతగాళ్లని వాళ్ల కులదైవం చౌడమ్మతల్లే కాపాడుతుందో — మరి ఏ నేత కాపాడతాడో కాలమే చెప్పాలి.

★



చిత్రం: పురందర్ (జమ్మలమడుగు)